


RNI Regd.No: APTEL/2012/45871

# ఇదినిజం

సాయంకాలం దినపత్రిక

పొట్టిశ్రీరాములు నెల్లూరు సంపుటి : 19 సంచిక: 177 ఎడిటర్: మాదాల వెంకటశేషగిరి ఆదివారం 08, మార్చి 2026 పేజీలు : 08 వెల: 02


## విజయవాడలో కార్డన్ సెర్చ్..



### పోలీసులపైకి కాల్పులకు యత్నం

విజయవాడఇది నిజం ప్రతినిధి: పోలీసులు కార్డన్‌సెర్చ్ చేస్తుండగా దుండగుడు పోలీసులపైకి కాల్పులకు యత్నించిన ఘటన విజయవాడ నగరంలో చోటుచేసుకుంది. బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దాంతో పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండగా.. దుండగుడు పోలీసులు, ఈగల్ టీమ్ అధికారులపైకి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందుతుడిని తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన మురళిగా గుర్తించారు. ట్రిగ్గర్ ప్రెస్ చేయకపోవడంతో బుల్లెట్ ఛాంబర్‌లోకి రాలేదని పోలీసులు తెలిపారు. ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా పోలీసులు, ఈగల్ టీమ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## భవిష్యత్‌లో అనేక దేశాలకు..

# మన విద్యుత్: చంద్రబాబు



దిల్లీ, ఇది నిజం ప్రతినిధి: అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ-అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళు‌తున్నట్లు చెప్పారు.ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం భవిష్యత్లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం.. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్సు కూడా వస్తున్నాయి" అని చంద్రబాబు అన్నారు.



# స్త్రీశక్తిలో.. స్కామ్ !

## కండక్టర్ల కక్కుర్తి

- బస్సులు ఖాళీ.. నిండుగా టికెట్లు
- మహిళలు లేకపోయినా జీరో టికెట్లు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

అమరావతి, ఇది నిజం ప్రతినిధి: మహిళల నుంచి ఒక్క రూపాయి వసూలు చేయకుండా పూర్తిగా ఉచితంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి లో మోసానికి చోటు ఎక్కడిది? అన్న అనుమానాలు ఎవరికైనా రావొచ్చు. అయితే ఈ పథకంలో ప్రభుత్వాన్ని మోసం చేసేలా అక్కడ క్కడ కొన్ని ఘటనలు నమోదు అవుతున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తొలుత కొన్నిచోట్ల మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ అవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆకస్మిక తనిఖీలు చేసి మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఆర్టీసీ అధికారులను ఆదేశించిందని సమాచారం.

### ఆరు నెలల్లో రూ.1714 కోట్లు



మహిళలు చెల్లించాల్సిన చార్జీల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఏ నెలకు ఆ నెల డబ్బు ఆర్టీసీకి జమ చేస్తోంది. ఇలా ఆరు నెలల్లో ఆర్టీసీకి రూ.1,714 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. ప్రతి నెల సగటున 25 లక్షల మంది ప్రయాణికులు ఉచిత బస్సును వాడుకుంటుండగా, ఫిబ్రవరి నెలలో సగటు 26 లక్షలకు చేరిందని చెబుతున్నారు. ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతుండటం వల్ల కండెక్టర్లు, డ్రైవర్లకు ఇన్సెంటివ్ లను చెల్లిస్తున్నారు. వారిపై పని ఒత్తిడి పెరగడంతో వచ్చిన ఆదాయంలో కొంత వారికి పంచుతున్నారని అంటున్నారు.

### కండెక్టర్ల అతి తెలివి

అయితే కొందరు కండెక్టర్లు అతి తెలివితో ఇన్సెంటివ్ వస్తుందనే ఉద్దేశంతో స్త్రీశక్తి టికెట్లు కొడుతున్నట్లు చెబుతున్నారు. మరికొందరు మహిళా ప్రయాణికులు బయలు దేరే స్టేజి, దిగాల్సిన స్టేజిలకు కాకుండా దూరంగా ఉన్న స్టేజిలకు టికెట్లు కొడుతూ అధిక మొత్తంలో సర్వీసు చేసినట్లు చూపుతున్నారని అంటున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తూ, తాము సొంత లాభం పొందుతున్నారు. అయితే దీనివల్ల పథకం లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం గ్రహించింది. ముందుగా ఇలాంటి పనులు చేయొద్దని కండెక్టర్లకు వార్నింగులు ఇవ్వాలని, అప్పటికీ వినకుంటే చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

### కండక్టర్ల మోసం

ఏపీలో అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకంలో కొందరు కండెక్టర్లు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇన్సెంటివ్ కోసం కక్కుర్తి పడుతున్న కొందరు కండెక్టర్లు బస్సులో మహిళా ప్రయాణికులు లేకపోయినా టికెట్లు కొడుతున్నారు. ఆర్టీసీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసిందని అంటున్నారు. దీంతో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు 15న రాష్ట్రంలో స్త్రీశక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు.

### సాఫీగానే ప్రయాణాలు

మిగతా రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో ఈ పథకం సజావుగా ఎలాంటి వివాదాలు, విమర్శలు లేకుండా అమలు అవుతోందని చెబుతున్నారు. ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఆధార్ కార్డు చూపి ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు మొదట్లో కొన్నిచోట్ల ఘర్షణలకు దిగినా, ఇప్పుడు అలాంటి వివాదాలకు వెళ్లకుండా సాఫీగానే ప్రయాణాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 92 శాతానికి చేరింది. దీంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరుతోందని అంటున్నారు

## తల్లికి వందనం రూ 252 కోట్లు పెండింగ్: లోకేష్ వెల్లడి



అమరావతి, ఇది నిజం ప్రతినిధి: తల్లికి వందనం పథకంలో రూ. 252 కోట్లు చెల్లింపు ప్రక్రియలో ఉన్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. శుక్రవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు భరత్ , రమేష్ యాదవ్, విక్రాంత్ అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ రాష్ట్రంలో 12వ తరగతి వరకు 79,51,903 మంది విద్యార్థులు నమోదయ్యారని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 67,01,653 మంది విద్యార్థులు లబ్ధిపొందారని వివరించారు. పాఠశాలల్లో విద్యార్థినిలకు శానిటరీ న్యాప్‌కిన్‌లు సరఫరా చేయడానికి పిఎబి రూ. 38 కోట్లు ప్రతిపాదించిందని సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇచ్చారు. బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ అడిగిన మరో ప్రశ్నకు సంబంధించి తిరుపతి, వైఎస్‌ఆర్ కడప జిల్లాల్లో 1,154.67 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌లున్నాయని, 396.96 ఎకరాలు పరిశ్రమలకు కేటాయించారని, మరో 354.69 ఎకరాలు పరిశ్రమలకు కేటాయించేందుకు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. గండికోట రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి 14 గ్రామాలకు చెందిన నిర్వాసిత కుటుంబాలకు ఒకొక్కరికి రూ. 3.25 లక్షలు పెంచిన పరిహారం చెల్లింపు ప్రతిపాదనలో ఉందని సభ్యులు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 122 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విఆర్‌లో ఉన్నారని సభ్యులు పి. చంద్రశేఖరరెడ్డి అడిగిన ప్రశ్నకు హోంమంత్రి వంగలపూడి అనిత లెలిపారు. శాసన మండలికి రెండు బిల్లులు : ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను విధింపు సవరణ బిల్లు 2026, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక యూనివర్శిటీ సవరణ బిల్లు 2026లను శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు శుక్రవారం సభ ముందు ఉంచారు.

## ఉన్న బిడ్డలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా ?..

### చంద్రబాబు పాలసీపై వైఎస్ షర్మిల మండిపాటు



అమరావతి, ఇది నిజం ప్రతినిధి::ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తగా ప్రతిపాదిస్తున్న పాపులేషన్ పాలసీ హాస్యాస్పదంగా ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర శనివారం ఏలూరు జిల్లాలో సాగుతోంది. ఉంగుటూరు నియోజకవర్గం, భీమడోలు మండల కేంద్రంలో జరిగిన రచ్చబండ కార్యక్రమామంలో ఆమె మాట్లాడుతూ పాపులేషన్ పాలసీపై మండిపడ్డారు .మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా ? చంద్రబాబు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని అన్నారు. చంద్రబాబు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవని, ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారని మండిపడ్డారు.

ఈదినిజం
RNI Regd.No: APTEL/2012/45871
సాయంకాలం దినపత్రిక

## సంపాదకీయం

**ఆదివారం 08 మార్చి 2026**

# స్వాహా..

బిజెపి ఏ ప్రాంతీయ పార్టీతో చెలిమి చేసినా దాన్ని మింగేయడం ఖాయమని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ వెయ్యడంతో మరోసారి రుజువయ్యింది. త్వరలోనే నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం, ఆ వెనువెంటనే బిజెపి నేత సిఎం కావడం జరుగుతుంది. త్వరలో బీహార్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నామినేషన్‌కు ముందు సామాజిక మాధ్యమాల్లో నితీశ్ ప్రకటనలోనే ఈ విషయం విదితమయ్యింది. శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ సభ్యునిగానే పనిచేశాననీ రాజ్యసభకు కూడా సభ్యునిగా సేవలందించాలనేది తన ఆకాంక్ష అని ఆయన చెప్పుకొచ్చారు. తీవ్రమైన పోటీలో గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలలకే రాజ్యసభ సభ్యత్వం మీద అంత మక్కువ ఎందుకు కలిగిందో అందరికీ తెలిసిందే! అసెంబ్లీ ఎన్నికల అనంతరం 89 సీట్లు గెలిచిన బిజెపి 85 సీట్లు పొందిన జెడి(యు)కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిననాడే ఈ పరిణామాన్ని విశ్లేషకులు ఊహించారు. 'మేం ముందునుంచే చెప్పాం. నితీశ్ ఆరు నెలలకంటే ఎక్కువ కాలం ఆ పదవిలో ఉండరన్నాం. అంతేకాదు, బిజెపి ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. వారిని నాశనం చేసిన చరిత్ర ఉంది. ఒబిసిలు, దళితులు, గిరిజనులకు అనుకూలంగా నిలిచే నాయకత్వాన్ని బిజెపి కోరుకోవడం లేదు. నితీశ్ కుమార్‌ను కేంద్ర రాజకీయాలకు పంపడం బీహార్ ప్రజల తీర్పునకు విరుద్ధం' అన్న బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ వ్యాఖ్యలను ఎవరూ కాదనలేరు.

ఇంతకుముందు మహారాష్ట్రలో మాదిరిగానే ఇప్పుడు బీహార్‌లో జరిగింది. శివసేన పార్టీతో బిజెపి చెలిమి చేసి ఆ పార్టీని చీల్చి, ఒక ముక్కను అక్కున చేర్చుకొని అప్పటికి ముఖ్యమంత్రి పదవినిచ్చి ఎన్నికలయ్యాక కమలనాథుడ్ని గద్దెనెక్కించారు. మహారాష్ట్రలో మరో ప్రధాన పార్టీగావున్న ఎన్‌సిపిని అలాగే చేశారు. అంతకుముందు గోవాలో ఎంజిపిని మింగేశారు. ఒడిషాలో బిజెడిని బుజ్జగిస్తూనే ఆ పార్టీని కూడా కరి మింగిన వెలగ పండు చందం గావించారు. ఏ రాష్ట్రంలోనైనా కమలం పార్టీ తీరు అదే! ఒకే దేశం... ఒకే పార్టీ... ఒకే నేత సిద్ధాంతం గల బిజెపికి ప్రాంతీయ పార్టీల పొడ గిట్టదు. సైద్ధాంతికంగానే ఆ పార్టీ అందుకు వ్యతిరేకం. కేంద్రీకరణ వారి విధానం కనుకనే రాష్ట్రాల హక్కుల్ని ఒక్కొక్కటిగా హరిస్తూ వస్తున్నారు. వాటికి చట్టబద్దంగా ఇవ్వాల్సిన నిధులను సైతం బిగబడుతున్నారు. ప్రజాస్వామ్యం పట్ల కూడా బిజెపికి నిబద్ధత కరువే. అటువంటి పార్టీతో చెలిమి చేసినవారు నష్టపోక తప్పదన్నది చరిత్ర చెప్పిన సత్యం. కేవలం నష్టపోవడమే కాదు క్రమంగా అంతరించిపోయే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అటువంటి భయం తోనే అకాలీదళ్ వంటి పార్టీలు జాగ్రత్త పడినట్టు కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు బిజెపి పంచన చేరడం ద్వారా తెలుగు ప్రజలకు తీరని హాని కలిగిస్తున్నాయి. విభజన చట్టం ద్వారా కల్పించవలసిన ప్రత్యేక హోదా ఎగ్గొట్టడమేగాక ఇతర హామీలనూ విస్మరించిన బిజెపితో ప్రత్యక్ష లేదా పరోక్ష నెయ్యం నెరపడం ద్రోహపూరిత చర్య. అసెంబ్లీలోనూ బయటా ఒకరిపై ఇంకొకరు కత్తులు దూసుకునేలా వ్యవహరించే టిడిపి వైసిపిలు బిజెపి విషయంలో మాత్రం ఏకాభిప్రాయమే ప్రదర్శించడం పచ్చి అవకాశవాదమే కదా! గతంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏకోన్ముఖంగా బిజెపి అభ్యర్థులకు ఓటు వేయడం, కేంద్రం తెచ్చిన దాదాపు అన్ని బిల్లులనూ ఇరు పార్టీలూ సమర్ధించడం దారుణం. తమను తాము లౌకిక పార్టీలుగా చెప్పుకొంటూ మతతత్వ బిజెపితో చెలిమి చేయడం ప్రజలను మోసగించడమే. 2024 ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ పొందలేని బిజెపి ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ అందిస్తున్న టిడిపి ఇప్పటికైనా పునరాలోచించాలి. కేంద్ర, బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపుల్లేవు. కేంద్రం నుండి గ్రాంట్లు సైతం ఏడాదికేడాది తగ్గిపోతూ వస్తున్నాయని శుక్రవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదిక కూడా పేర్కొంది. రాష్ట్రానికి తీవ్రమైన చేటు చేస్తున్న బిజెపితో చెలిమి విషయాన్ని టిడిపి సమీక్షించుకొని ధృతరాష్ట్ర కౌగిలిని వదిలించుకోవడం విజ్ఞతగా వుంటుంది. లేదా జెడి(యు) మాదిరి కావడానికి సన్నద్ధమైపోవాలి! తస్మాత్ జాగ్రత్త!

# అసందర్భ సందర్శన, అమానుష దురాక్రమణ




ప్రధానమంత్రి మోడీ ఇజ్రాయిల్ సందర్శన చాలా పొరబాటు ఆలోచన అనీ, ఎంచుకున్న సమయం కూడా ఏ మాత్రం సరైంది కాదనీ ఇప్పుడు సుస్పష్టమైపోయింది. కేవలం నైతిక సమస్య పరిధిని మించి భౌగోళిక రాజకీయాలు, జాతీయ వ్యూహంపై ప్రభావం చూపించింది. గాజాలో జాతి హత్యాకాండ రాక్షసత్వం కొనసాగుతూనే వుంది. తుడిచిపెట్టేందుకు ప్రారంభించిన పాలస్తీనా ప్రజానీకాన్ని, భూఖండాన్ని చుట్టుముట్టిన విధ్వంసం అవశేషాలు ఇంకా పూర్తిగా తొలగించబడనే లేదు. దానికి తోడు పశ్చిమ తీరంలో ఇజ్రాయిల్ నిర్మాణ సముదాయాల విస్తరణ వేగంగా సాగిపోతున్నది. ఇదంతా పాలస్తీనా సమస్యకు ఇరుదేశాల స్థాపనతో కూడిన పరిష్కారం జరగకుండా దెబ్బతీస్తున్నది. కాల్పుల విరమణ ఒప్పందం పై సంతకాలు జరిగినా హత్యాకాండ ఆందోళనకరమైన స్థాయిలో జరిగిపోతున్నదని ప్రపంచం గుర్తిస్తున్నది. ట్రంప్ ఏర్పాటు చేసిన శాంతి బోర్డుకు సాధారణ పరిస్థితి నెలకొల్పాలనే ఉద్దేశంగానీ ఆ శక్తిగానీ లేవు. అసలు దాని ఏర్పాటే ఐక్యరాజ్యసమితి వ్యవస్థ మూలాలను దెబ్బ తీసేందుకు ఉద్దేశించింది. డోనాల్డ్ ట్రంప్ చైర్మన్‌గా వుండటం ఒకటైతే–ఈ మొత్తం ప్రక్రియను ముందుకు తీసుకుపోవడానికి సారథ్యం ఇరాక్ దురాక్రమణ సమయంలో అత్యంత అసహ్యకర పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్‌కు అప్పగించడం నైతికతనే సవాలు చేసింది. పశ్చిమాసియాలో భారత దేశ వ్యూహాత్మక ప్రయోజనాలకు కావలసినంత రక్షణ వుంది. గల్ఫ్‌లోని అనేక దేశాలతో, ఇరాన్‌తో భారతీయ నాగరిక పౌర సంబంధాలు చరిత్ర క్రమంలో నిక్షిప్తమై వున్నాయి. ఆధునిక కాలంలోనైతే ఈ ప్రాంతంలోని అనేక దేశాలలో భారతీయ వలస కార్మికులు భారీ సంఖ్యలో వుండటం ఇప్పటి విషయం. పశ్చిమాసియాలోని వారి నుంచి వచ్చే చెల్లింపులు అనేక రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలలో ఎంతగానో కీలక పాత్ర వహిస్తున్నాయి. అంతేగాక మన చమురు సరఫరాలలో అధిక భాగం హార్మోజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతాయి. అగ్రగామిగా ఇరాన్–ఇజ్రాయిల్‌లో మోడీగాజా జాతి హత్యాకాండ సమయం నుంచి యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ నిర్వాకాలు అరబ్ దేశాల వీధులలో ఆవేశం కుమ్మరిస్తూ వచ్చాయి. ఇజ్రాయిల్ పట్ల పెరిగిన వ్యతిరేకత గల్ఫ్ దేశాలలో, పశ్చిమాసియా ప్రభుత్వాలలో ఎంత ప్రభావం చూపిందంటే అబ్రహం ఒప్పందాలన్నీ నిలిపివేయబడ్డాయి. ఈ ప్రతిఘటనలకు నాయకత్వం వహిస్తున్నది ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ అన్నది నిస్సందేహం. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో మోడీ చెట్టపట్టాల్ కట్టడం కన్నా దారుణమైన దృశ్యం మరొకటి వుండదు. గాజాలో మారణకాండ మృతుల గురించి నోరెత్తకుండా మారణహోమం మృతులకు సంస్మరణ కార్యక్రమంలో మోడీ పాల్గొనడం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆ జాతి హత్యాకాండతో విభేదించే భారతదేశ విధానాన్ని ప్రధానమంత్రి మోడీ తలకిందులుగా మార్చేశారని చెప్పాలి. ప్రపంచంలోనేగాక ఇజ్రాయిల్‌లో కూడా విశ్వాసం నిలబెట్టుకోవడానికి విన్యాసాలు చేస్తున్న నెతన్యాహుకు ఆమోద ముద్ర వేయడంలో దౌత్యపరమైన ప్రాథమిక సూత్రాలు కూడా కనిపించవు. ఇది భారతదేశం అనుసరిస్తూ వస్తున్న సూత్రబద్ధమైన సామ్రాజ్యవాద వ్యతిరేక అలీన విధానాలను కూడా కుప్పకూల్చింది ఇజ్రాయిల్ పార్లమెంటు నెస్సెట్‌లో మోడీ ప్రసంగాన్ని మొత్తం ప్రతిపక్షం బహిష్కరించడం దీనికే నిదర్శనం. అంతేగాక ఇండియా, అమెరికా, ఇజ్రాయిల్‌తో కూడిన షణ్ముఖ కూటమిని నెతన్యాహు ముందుకు తేవడం కూడా మరో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నది. భారతదేశ భద్రతా సైనిక కొనుగోళ్లలో పెద్ద భాగం ఇజ్రాయిల్ నుంచే జరుగుతుందని చెప్పే సంకేతమది. దీనికీ భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రంతోగానీ, జాతీయ ప్రయోజనాలతో గానీ ఏమాత్రం సంబంధం లేదు. కేవలం అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా జరిగిందే...అన్న వాస్తవాన్ని పథకం ప్రకారం సాగిన ఈ చెట్టపట్టాల తతంగం ఏ మాత్రం దాచిపెట్టలేకపోయింది. ఇరాన్‌పైన దాడి చేయడానికి అమెరికా, ఇజ్రాయిల్ సంసిద్ధంగా వున్న విషయం తెలియదని చెప్పడం భారతదేశ రాజకీయ నిఘా యంత్రాంగం అమాయకత్వమే. ఇరాన్ వరకూ చూస్తే గాజా జాతి హత్యాకాండకు పాల్పడిన ఇజ్రాయిల్ దుండగీడుతనాన్ని ప్రతిఘటించడంలో ఆ ప్రాంతానికి అగ్రభాగాన నిలబడింది. చైనాకు, రష్యాకు ఇరాన్ మరింత సన్నిహితం కావడం కూడా ఇజ్రాయిల్ అమెరికాల రాజకీయ, భౌగోళిక వ్యూహాలకు ప్రధాన ప్రతిబంధకమైంది. ఆ కారణంగానే ఇరాన్ వారి దాడికి లక్ష్యంగా మారుతున్నట్టు స్పష్టమైపోయింది. అమెరికా బూటకత్వంఅమెరికా విదేశాంగ విధాన బూటకత్వాన్ని ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. ఎప్పటికంటే ఇప్పుడది మరింత ఎక్కువగా బయటపడిపోయింది. పెట్టుబడిదారీ విధానానికి వంత పాడే అనేక మంది సమకాలీన వ్యాఖ్యాతలు లెనిన్ సిద్ధాంతాలకు కాలం చెల్లిందని ప్రకటించడానికి ఆదుర్దాపడి పోతుంటారు. కానీ యుద్ధం, పెట్టుబడిదారీ విధానం అనేవి అవిభాజ్య కవలల వంటివని ఆయన నొక్కి చెప్పిన సిద్ధాంతం ఎంతగానో సజీవంగా శక్తివంతంగా వినిపిస్తుంది. యూదు జాత్యంహంకారంతో కూడిన అఖండ మహా ఇజ్రాయిల్ పథకానికి ఇరాన్ నుంచి వస్తున్న ప్రతిఘటనను నిర్వీర్యం చేయాలంటూ అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయిల్ పురికొల్పింది. అదే సమయంలో ఈ ప్రాంతంలో తమ తిరుగులేని ఆధిపత్యాన్ని నెలకొల్పుకోడానికి, రష్యా చైనా ప్రభావం పెరక్కుండా అడ్డుకోవడానికిగాను ఇరాన్ పాలక వ్యవస్థను మార్చాలని ట్రంప్ పాలన వ్యవస్థ కూడా తలపోసింది. ట్రంప్ ఏదో శాంతికాముక అధ్యక్షుడనేది ఒక బూటకం మాత్రమే. ఇరాన్ అణు కార్యక్రమం గురించి పదేపదే మాట్లాడటం మొదటి నుంచీ మోసపూరితమే. ఇజ్రాయిల్‌కు రహస్య అణ్వస్త్ర సామర్థ్యం వుందనేది బహిరంగ రహస్యం అయినా ఎవరూ దాని గురించి పెదవి మెదపరు. మరోవైపున ఇరాన్ తాము అణ్వాయుధం చేయడం లేదని తేటతెల్లంగా ప్రకటించింది. పర్యవేక్షకులకు ఆ ప్రదేశాల సందర్శనను అనుమతించింది. అయితే అక్కడ పారదర్శకత ప్రమాణాలపై అంతర్జాతీయ అణు సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ) చొరబాటుదారీ రాజకీయ దురుద్దేశాలతో ప్రకటన చేసిన తర్వాతనే ప్రతిష్టంభన ఉత్పన్నమైంది. దుష్ట పథకం అదే అంతేగాక 2025లో ఇరాన్ అణు ప్రదేశాలపై భారీ ఎత్తున బాంబు దాడులు జరిగాయి. వాటిని ధ్వంసం చేశామనీ ఇక సమీప భవిష్యత్తులో ఉత్పత్తి చేయగల స్థితిలో లేవని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ కూడా ఓమన్ మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన సంప్రదింపులు మొదలుపెట్టింది. అయితే అది వారు గల్ఫ్‌లో సైనిక బలం పోగేసుకోవడానికీ, అమెరికా వైమానిక బాంబు దాడి సంపత్తిని ఇరాన్ పైకి మోహరించడానికి ఒక వంచనాత్మక ఎత్తుగడ మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ రెండూ కలసికట్టుగా దాడి చేయడాన్ని బట్టి చూస్తే ఇది ఖచ్చితంగా పథకం ప్రకారమే జరిగిందని తెలిసిపోతుంది. ఇరాన్ తన ఆయుధ నిల్వలను గణనీయంగా తగ్గించుకుని దౌత్య పరమైన పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలను అందుకే తిరస్కరించారు. ఇప్పుడు ఎప్పుడూ కూడా అణుబాంబు చేయబోమని చెప్పినట్టు ఓమన్ విదేశాంగ మంత్రి ద్వారా బహిరంగంగానే ప్రకటించారు కూడా. అయినా వారు తిరస్కరించారు. ఈ మొత్తం పరిణామ క్రమం మోడీ ఇండియాకు తిరిగివచ్చిన 48 గంటలలోనే జరిగింది. మొత్తం ఘటనల క్రమం బట్టి చూస్తే ఈ సైనిక దుస్సాహసంలో ఇండియా దాదాపు భాగంగా కనిపిస్తుంది. అమెరికా ఏ విధమైన లెక్కలు వేసుకున్నా అవన్నీ తప్పిపోయాయి. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలన్నిటిపై ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. టెల్ అవీవ్‌తో సహా ఇజ్రాయిల్ నగరాలనేక వాటిపై ఇరాన్ మిసైల్ దాడులు మరింత తీవ్రంగా సాగుతున్నాయి. అనివార్య ప్రతిఘటన ఇరాన్ ప్రతీకార చర్యలను పిరికితనంగా అమెరికా, దాని మిత్రులు అభివర్ణించడం విడ్డూరంగా కనిపిస్తుంది. అమెరికా ఇజ్రాయిల్ ఉమ్మడిగా జరిపిన దురాక్రమణ కావాలని చేసింది. వేరువేరుగా కనిపిస్తూ కలిసి చేసిన దురాక్రమణలో అలీ ఖమేనీతో సహా తమ నాయకత్వంలో ప్రముఖమైన వారిని హత్యగావించిన తర్వాత కేవలం తన మనుగడ కోసం వార్యంగా చేస్తున్నది ఇరాన్ ప్రతిఘటన. ఇరాన్‌కు గల వికేంద్రీకృతమైన, బహుళ దొంతరలతో కూడిన ప్రత్యామ్నాయ నాయకత్వ వ్యవస్థలను, సైనిక సంఘర్షణ ఏర్పాట్లు బాగా తెలిసినవే. అది వాటిని స్పష్టంగా ప్రదర్శించడమేగాక ఇప్పుడు క్రియాశీలం చేసింది. ఇరాన్ హార్మోజ్ జలసంధిని మూసివేయడంతో భారత దేశ విదేశాంగ విధానం మాత్రం స్వీయ పరాజయ కారకంగా మారింది. భారతీయ ఇంధన సరఫరాలలో అత్యధిక భాగం దాని ద్వారానే చేరాల్సి వుండగా ఈ నిర్ణయం చమురు ధరలు ఉన్నఫళాన పెరిగిపోవడానికి కారణమైంది. తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న అవివేకి గురించి కాళిదాసు జానపద కథలో చూస్తాం. ఇజ్రాయిల్‌తో చెట్టపట్టాల తతంగం భారత విదేశాంగ విధానాన్ని అమెరికా వ్యూహాత్మక పథకాలకు ఉపాంగంగా మార్చివేసింది. దక్షిణాది దేశాలకు నాయకత్వం వహిస్తున్నట్టు భారత దేశం పదేపదే చెప్పుకున్న గొప్పలను పటాపంచలు చేసింది. ఈ సైనిక ఘర్షణలు అంతం కావాలనీ, శాంతి పునరుద్ధరణ కావాలని మనం సమిష్టి స్వరం వినిపించాల్సి వుంది.

# కొత్త నేస్తరికం!

మోకాళ్ళ పైకి మడుచుకున్న పొందూరు ఎర్రజీరల పంచె.. పులి చర్మంలాగా.. పిడికడంత పులిగోరు గొలుసు, కాలసర్పం లాగా.. నుదుట విభూతి, కాశీ శవ భస్మం లాగా... తెల్ల గ్రానైట్ మెట్లు మీద నుంచి తమరు దిగుతుంటే, మంచు పలకల మీద నడిచి వస్తున్న ఆ మహా శివుడే దిగి వస్తున్నట్టు అనిపించింది నాయుడు గారూ!"విజయనగరం నుంచి వచ్చిన బుస్సీ నాయుడు ముందు హాల్లో.. కుర్చీలోంచి లేచి, చేతులు జోడించి, పరమ వినయంగా నడుం వంచి ప్రస్తుతించాడు. దశుమంతు నాయుడు కూడా, ఉబ్బులింగడు. సరదా పడిపోయాడా మాటల కి!"ఇజానగరమం టోనే ఇద్యల నగరం.. కోవా నుంచి గోవా వరకు ఏదైనా వొర్ణించగలరు!''– పరదేశికి, బుస్సీ పరిచయం ఇష్టం లేదు. పార్టీ ఫిరాయించినా, టికెట్ రాని మాజీ ఎమ్మెల్యే లాగా మొహం మాడిపోయింది.''ఏళగాని ఏళా! సాయింత్రం వచ్చినారేటి?" పొగడ్తల పొగడ పూల దండకు పొంగిపోయి, బుస్సీ నాయుడి భుజం తట్టాడు నాయుడు. తెచ్చిన బంగారు అంచు కండువా కప్పి, బుట్టడు పూలను పాదాలపై కుమ్మరించి, శిరసు వంచి, మరింత మహా వినయ ప్రదర్శన చేశాడు బుస్సీ."అదేటండీ.. దేముడికి తప్ప మనుషుల పాదాల మీద బతికున్నప్పుడు పూలు ఎయ్యగూడదు.''– బాగా నొచ్చుకున్నాడు నాయుడు."పర్లేదు నాయుడూ! కలర్ తప్ప స్మెల్ లేని పూలు.. ఎక్కడేసినా ఒకటే!"– గోడకు చేరబడి వెటకారంగా అన్నాడు పరదేశి."అలాక్కాదం డీ.. దైవ సమానులైన వారి దగ్గరకు వెళ్లినప్పుడు, తృణమో, పణమో! పుష్పమో, తోయమో! కాయో, పండో తీసుకెళ్లాలి. వట్టి చేతులతో వెళ్ళకూడదని మా పీఠాధిపతి గారు సెలవిచ్చారు."''నాయనా! ఇక్కడ మా పీటకి



నాయుడు గారే అధిపతి. నువ్వొచ్చిన పని ఏటో సెప్పుకో! ఎందుకు, నోట్లో బూరెలొండడం!?"– చిరాకు పడి, తోట వైపు బయలుదేరాడు."ఆడంతే లేండి..

## జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్. నిర్వహించిన పోలీసులు







తిరుపతి. సూళ్లూరుపేట ( ఇదినిజం ప్రతినిధి): తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్ (జశీతీసశీఅ ఖఅస వామ్మతీఎష్ట్ర) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిధిలోని అన్ని సబ్‌డివిజన్‌లలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద ప్రాంతాలు, నివాస ప్రాంతాలు, అద్దె ఇళ్లను ప్రత్యేకంగా పరిశీలిస్తూ ప్రతి ఇంటిని సోదా చేసి అక్కడ నివసిస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అద్దెదారులు, వలస కార్మికులు మరియు ఇతరుల వివరాలను నమోదు చేసుకొని అవసరమైన సమాచారాన్ని సేకరించారు. అదేవిధంగా ప్రాంతాల్లో సంచరిస్తున్న వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలను గౌరవించడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు సహకరించాలని ప్రజలందరితో ముకుమ్మడిగా ప్రతిజ్ఞ చేయించారు.

## సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సంయుక్త ఆధ్వర్యంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం' పై కార్యక్రమం.

నెల్లూరు(ఇదినిజం ప్రతినిధి ): కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూ నికేషన్ (జదీజ), నెల్లూరు క్షేత్ర కార్యా లయ ం మరియు సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కాలేజ్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ' అంతర్జాతీయ మహిళా దినోత్సవం" కార్య క్రమం లో సెంట్రల్ బ్యూ రోఆఫ్ కమ్యూనికేషన్ (జదీజ) ప్రతినిధి పి. హరికృష్ణ మాట్లాడుతూ మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఈరోజు అనగా మార్చి 7వ తేదీన సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కాలేజ్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వివిధ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు స్కిల్స్ మీద ట్రైనింగ్ ఇవ్వడం ఆర్థికంగా చేయూతనిచ్చి మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారిత,





సమానత్వం,నాయకత్వం సాధ్యమవుతుందని తెలియజేసారు , అదేవిధంగా శాస్త్ర సాంకేతిక విద్య వైద్య ఉపాధి రంగాల్లో కూడా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ అమల గారు మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థిని బాగా చదివి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని అదేవిధంగా భారత ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తుందని అనగా ఆర్మీ ఎయిర్ ఫోర్స్ వంటి రంగాలలో కూడా మహిళలు ముందజలో ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవ పురస్కరించుకొని కేక్ కట్ చేసి తమ యొక్క ఆనందాన్ని ఒకరికొకరు పంచుకున్నారు, దేశభక్తి గీతాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు, ప్రిన్సిపాల్ అమల, చీజజ ఆఫీసర్ విజయ నిర్మల బోధన మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఘనంగా సౌందర్య లహరి పారాయణం

నెల్లూరు(ఇదినిజం ప్రతినిది): బుచ్చిరెడ్డి పాళెం మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన 'సౌందర్య లహరి' మరియు 'మూక పంచశతి' పారాయణ కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జొన్నవాడ కామాక్షి అమ్మవారి సన్నిధికి విచ్చేసిన వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం వేమిరెడ్డి దంపతులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం 500 మంది మహిళలు సౌందర్య లహరిని పారాయణమనే అద్భుత ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గార్లు నిర్వాహకులను ప్రశంసించారు. ఆది శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరి కేవలం శ్లోకం మాత్రమే కాదని, అది అమ్మవారి అనుగ్రహమని, దీనివల్ల ప్రజలకు ఆధ్యాత్మికంగా, మానసికంగా ఎంతో స్వాంతన చేకూరుతుందని వారు పేర్కొన్నారు. జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నేరెళ్ల పద్మశ్రీ బృందాన్ని వేమిరెడ్డి దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. శృంగేరీ పీఠం వారి ఆన్‌లైన్ క్లాసుల ద్వారా శిక్షణ పొంది సామాన్య ప్రజలకు సౌందర్య లహరిని చేరువ చేస్తున్న నేరెళ్ల బృందం కృషితో ఇప్పటికే జనవరిలో గురువాయూర్‌లో మొదటి కార్యక్రమం జరిగిందని ఇప్పుడు రెండో కార్యక్రమం జొన్నవాడలో నిర్వహించడం సంతోషకరమని వారు కొనియాడారు. ప్రజలందరిపై కామాక్షితాయి, మల్లికార్జున స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని







## వేమిరెడ్డి దంపతుల సమక్షంలో 500 మంది మహిళలతో సౌందర్య లహరి ఆలాపన.

వారు ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఆలయ పరిపాలనాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు స్థానిక తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని కలిసిన వైసీపీ నేత కొండ్రెడ్డి రంగారెడ్డి.



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు రాంజీ నగర్ వైసిపి ఆఫీస్ లో వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నినూతనంగా వైసిపి నగర నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైనకొండ్రెడ్డి రంగారెడ్డి కలిసి పరిశీలకులుగా తనకు అవకాశం లభించడం పట్ల చంద్రశేఖర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కొండ్రెడ్డి రంగారెడ్డి కి అభినందనలు తెలియజేశారు వైయస్ జగన్మోహన్ రెడ్డి. తనకు ఇచ్చిన బాధ్యతలను ఎంతో .. చిత్తశుద్ధితో నిర్వహిస్తూ.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచనల మేరకు నెల్లూరు నగర నియోజకవర్గంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తానని.. కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు.



## శ్రీహరికోట సిఐఎస్ఎఫ్ యూనిట్ కు 2025 సంవత్సరానికి ఉత్తమ యూనిట్ ట్రోఫీ

శ్రీహరికోట. సూళ్లూరుపేట (ఇది నిజం ప్రతినిధి ): శ్రీహరికోట సిఐఎస్ఎఫ్ యూనిట్, ఎస్డిఎస్సి షార్, శ్రీహరికోట, సాధారణ ప్రాంతంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్/సీనియర్ కమాండెంట్ ర్యాంకు కలిగిన అధికారి నేతృత్వంలోని యూనిట్ల విభాగంలో 2025 సంవత్సరానికి గాను ఉత్తమ యూనిట్ ట్రోఫీని గెలుచుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఎస్డిఎస్సి షార్, శ్రీహరికోటలోని సిఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్ కమాండెంట్ అయిన శ్రీ సంజీత్ కుమార్, సిఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అయిన ఐపిఎస్ అధికారి శ్రీ ప్రవీర్ రంజన్ గారి నుండి అందుకున్నారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమం మార్చి 6, 2026న, ఒడిశాలోని కెఆర్టిసి ముండాలి వద్ద జరిగిన స్థాపనా దినోత్సవ కార్యక్రమం (సిడిపి-2026) సందర్భంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవనీయ కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారు విచ్చేసి శోభను చేకూర్చారు. యాక్సెస్ కంట్రోల్, చుట్టుపక్కల భద్రత, క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్టి) మద్దతు, సాంకేతిక పరిజ్ఞానం యొక్క వివేకవంతమైన ఉపయోగం, ఆకస్మిక ప్రణాళికలు మరియు మాక్ డ్రిల్స్ నిర్వహణ వంటి పది కంటే ఎక్కువ కీలక పనితీరు ప్రమాణాలలో రాణించడం ద్వారా ఈ యూనిట్ ఈ ట్రోఫీని సాధించింది. ఈ విజయంతో పాటు, ఈ యూనిట్ 2025 మరియు 2026లకు గాను సైకిల్ ర్యాలీని కూడా విజయవంతంగా నిర్వహించింది. శ్రీ సంజీత్ కుమార్ యొక్క సమర్థవంతమైన నాయకత్వంలో, అతని బృందం శ్రీహరికోటలోని ఎస్డిఎస్సి షార్ వద్ద వివిధ ప్రయోగాల సమయంలో 10,000 కంటే ఎక్కువ మంది హాజరైనవారికి ఎటువంటి సమస్యలు లేకుండా భద్రతను కల్పించడంలో విజయం సాధించింది మరియు వివిఐపి మరియు విఐపిల సాఫీగా రాకపోకలను నిర్ధారించింది. సిఐఎస్ఎఫ్ గురించి: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) భారతదేశంలోని ఒక ప్రధాన కేంద్ర సాయుధ పోలీసు బలగం, ఇందులో 132ం బెటాలియన్లలో 1,60,000 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఇది 257ం ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్యులు), విమానాశ్రయాలు, మెట్రో నెట్వర్కు (ఢిల్లీ మెట్రో వంటివి), అణు విద్యుత్ కేంద్రాలు, అంతరిక్ష ప్రయోగ కేంద్రాలు మరియు 2026 నాటికి, 12 రిజర్వ్ బెటాలియన్లతో సహా 15ం ప్రత్యేక విభాగాలతో సహా కీలకమైన మౌలిక సదుపాయాలకు భద్రతను కల్పిస్తుంది.



## పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యం.

నెల్లూరు, మార్చి 7 : (ఇదినిజం ప్రతినిధి ):పేదలకు సొంత ఇంటిని పూర్తి చేసి ఇవ్వడమే ప్రధాన లక్ష్యంగా గృహనిర్మాణశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ వీసీ హాల్లో జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆప్షన్-3 క్రింద గుర్తించిన నాణ్యత లేని ఇళ్ల నిర్మాణాలను వెంటనే సరిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ ఇళ్ల నిర్మాణాల మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అధికారులు కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ఆప్షన్ 3 ఇళ్లను వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. వీలైనన్ని ఎక్కువ ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించి పేదలకు అందించడమే లక్ష్యంగా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణశాఖ ఇంచార్జ్ పిడి మోహన్ రావు, డిఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.





## వేసవి లో మూగజీవాల దాహం తీరుస్తున్న పంచాయితీ కార్యదర్శి శ్రీలత.

మర్రిపాడు (ఇదినిజం ప్రతినిధి ):మానవసేవయే మాధవ సేవ...అంటారు మహనీయులు. అదే మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ మూగ జీవాల సేవ కూడా మాధవ సేవగా చాటి చెబుతున్నారు పంచాయితీ కార్యదర్శి



శ్రీలత. ప్రస్తుతం ఎండలు విపరీతమయ్యాయి. ఈ నేపథ్యంలో అక్కడక్కడ ప్రజానీకమే త్రాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ఇటువంటి స్థితిలో మూగజీవాలు సైతం తమ దప్పిక తీర్చుకునేందుకు ఆరాట పడుతున్నాయి. హొకాని మెట్ట ప్రాంతం మర్రిపాడు నుండి కడప- నెల్లూరు అంతర జిల్లా సరిహద్దు ప్రాంతం వరకు నివసిస్తున్న మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు 15 కిలోమీటర్లు మేర నీటి తొట్లను ఏర్పాటు చేసింది పంచాయితీ కార్యదర్శి శ్రీలత. గత 5సంవత్సరాలు గా మార్చి నెల వస్తే నీటి తొట్లను నింపుతూ వానరాలు,పశువుల దప్పికను తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అడగనిదే అమ్మ అయినా పెట్టదంటారు కాని మూగ జీవుల ఆత్మీయురాలు కార్యదర్శి శ్రీలత అడగకుండానే మూగజీవులకు నీటిని ఏర్పాటు చేసి మానవతా దృక్పథంతో మూగజీవాల సేవలో నిరంతరం తపిస్తున్నారు. ట్రాక్టర్ నీటి ట్యాంకర్ తో తోట్లకు నీటిని నింపి మూగజీవుల దాహార్తిని తీరుస్తున్న పంచాయితీ కార్యదర్శి శ్రీలత కు మండల ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

RNI Regd.No: APTEL/2012/45871
ఇదినిజం
సాయంకాలం దినపత్రిక



## హుస్సేన్ హత్య కేసులో హిజ్రాలు అరెస్టు, 6 మందిని రిమాండ్ కు తరలింపు.

నాయుడుపేట. (ఇది నిజం ప్రతినిధి ) డివిజన్ ఇన్చార్జి : తిరుపతి జిల్లా



నాయుడు పేట పట్టణం సాయబులపాలెం నివాసం ఉంటున్న ఉస్సేన్ హత్య కేసులో నిందితులైన భాను సదా భావన, అశ్విని ఏడుమంది హిజ్రాలను అరెస్ట్ చేసి కోర్టుకి పంపినట్లు నాయుడు పేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పీ చెంచుబాబు తెలిపారు. మృతుడు సోదరుడు ఉస్మాన్, భాను అను హిజ్రాతో సైక్యతగా ఉంటూ బంగారం తీసుకొని కుదువ పెట్టుకున్న విషయమై మనస్పర్థలు ఏర్పడి గత నెల 24 న రాత్రి 8 గంటల ప్రాంతంలో భాను మరో ఆరు మంది హిజ్రాలు మృతుని ఇంటి వద్దకు వెళ్లి గొడవ పడి కిడ్నప్ చేసి తీసుకొని వెళ్లి కొట్టి చంపి అన్నమేడు రైల్వే ట్రాక్ పై పడ వేసి నట్లు విచారణలో వెల్లడయిందని మృతుడు సోదరుని పిర్యాదు మేరకు కిడ్నప్ కేసునమోదు చేసి విచారించిగా ఈ మేరకు వివరాలు తెలిసాయాని తెలిపారు. ఇక మీదట రోడ్లు మీద హిజ్రాలు దండకాలు చేసి రుబాబు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కేజీబివి లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు.

మర్రిపాడు.(ప్రభాకర్ మేకల //ఇదినిజం బ్యూరో ఇంచార్జ్ ):మండల కేంద్రం మర్రిపాడు కేజీబివి పాఠశాలలో శనివారం కేజీబివి ప్రిన్సిపాల్ సిహెచ్.



లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పాఠశాల టీచర్లు, విద్యార్థినిలు, సిబ్బంది తో కలిసి మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన పాఠశాల మహిళ సిబ్బందిని సన్మానించారు.ప్రిన్సిపాల్ సిహెచ్. లక్ష్మీదేవి మాట్లాడుతూ సమానత్వం అనేది అది నుండి ఇప్పటి వరకూ విజయవంతంగా కొనసాగుతూనే ఉందని అసాధారణ ఆధ్యాత్మిక భావజాలం అలవరచుకుంటే అన్నీఅనుకూలమేనని దేవుని పట్ల భయంతో ఉన్న వారే స్త్రీనిగౌరవిస్తారని తెలియజేసారు.మహిళలను గౌరవించుకోవ డం పురుషుల ప్రధాన బాధ్యత అన్నారు. మహిళ సృష్ఠికి మూలం జీవనాధారం అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఇంకా ముందు వరుసలో ని లువాలని పురుషులతో సమానంగా ఉంటేనే గౌరవప్రదం అన్నారు.మహిళలని పూజించకున్నా దయచేసి గుర్తించి గౌరవించండి మహిళకు అదే చాలు అన్న వేడుకోలు యవ్వన స్త్రీలదని రోజు రోజుకు ఇలాంటి విషమ పరిస్థితులు నేటి సమాజంలో నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి పురుష జన్మ వైవిధ్యం ఏమంటే, తల్లిగా దయతలచి ఒక స్త్రీ పెట్టిన భిక్షే పురుషునికి ఈజన్మ అన్న సత్యం ఎరిగిన పురుషోత్తములే దేవునికి ఎప్పుడూ భయపడుతూమెరుగైన సమాజం కోసం కృషి చేస్తారని స్త్రీ శిశు సంక్షేమాన్ని కోరేవారంతా సమాజ ఉద్ధారకులేని ఈ సందర్భంగా కేజీబివి ప్రిన్సిపాల్ సిహెచ్. లక్ష్మీదేవి తెలియజేసారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి,మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లో టధన్ బాద్ - అల్లప్పుజాఊ ఎక్స్ప్రెస్ లో గంజాయి పట్టివేత -18 కిలోల స్వాధీనం

సూళ్లూరుపేట అర్బన్ (ఇది నిజం ప్రతినిధి) తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లో ట్రైన్ నెంబర్ 13351 (ధన్ బాద్ – అల్లప్పుజా) ఎక్స్ప్రెస్ జనరల్ బోగీలో ఖాకీ ఎన్నికల ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించగా రైల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అనాదిగా ఉన్న బ్యాగులను పరిశీలించగా గంజాయి



బండిళు బయటపడ్డాయి మొత్తం 16 బండిళులో సుమారు 18 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు ఘటనకు సంబంధించిన ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.

## నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సందడిగా మహిళా దినోత్సవ వేడుకలు.

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు గాంధీ నగర్ =చీ కళ్యాణ మండపంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ,వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైసిపి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు



కేక్ కటింగ్ నిర్వహించి.. సందడిగా మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన.. 10 మంది మహిళలను.. ఎంపిక చేసి.. అతిథులు ఘనంగా సత్కరించారు.గత ప్రభుత్వంలో మహిళా సాధికారత దిశగా.. జగన్మోహన్ రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూగత వైసిపి ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో.. అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు .ముఖ్యంగా చేయూత, కాపు నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ, పథకాలు అమలు చేసి..మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిదని కొనియాడారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి.. మహిళలను దగా చేసిందని మండిపడ్డారు. నేడు అంగన్వాడి మహిళలు జీతాలు పెంచమని రోడ్డెక్కితే ప్రభుత్వానికి మహిళలు అన్న కనీస సానుభూతి లేకుండా నిర్ధాక్షణంగా రోడ్డుమీద ఈడ్చి పారేస్తూ నరకం చూపిస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వంలో 7వేలు ఉన్న అంగన్వాడీల వేతనాలను 11500 లకు పెంచి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు మహిళల కు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు.మహిళల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా.. వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో పాలన అందించారని తెలిపారు. అనంతరం మహిళలు.. రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి.. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు..కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దారుణాలు.. అన్యాయాలపై పోరాటం సాగించాలని పలు తీర్మానాలు చేసి నిర్ణయించుకున్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ, వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ సునంద, 8 డివిజన్ కార్పొరేటర్ కామాక్షి దేవి, గారు,50 వ డివిజన్ కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి , నెల్లూరు నగర నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ధనుజా రెడ్డి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు వాణి, మహిళా విభాగం నేతలు సుప్రియ, సుహాసిని, రమీజా, సులోచనమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## సురుటుపల్లి గ్రామంలో చెరువు కాలువపై ఆక్రమణలు

**మట్టి పోసి కాలువ మూసివేత, రైతులకు తీవ్ర ఇబ్బందులు**

నాగలాపురం. (ఇది నిజం ప్రతినిధి) డివిజన్ ఇన్చార్జి :తిరుపతి జిల్లా నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి గ్రామంలో చెరువు పోరంబోకు భూమిపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 8/21లో సుమారు 2.55 ఎకరాల చెరువు పోరంబోకు భూమి రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని, అయితే అధికార పార్టీ నాయకుల అండదండలతో తమిళనాడుకు చెందిన కొంతమంది వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారని సురుటుపల్లి సర్పంచ్ భర్తతో పాటుస్థానికులువాపోయారు.గ్రామస్తుల వివరాల ప్రకారం రోడ్డుకు ఆనుకుని చెరువుకు సంబంధించిన కాలువ పరంబోకు భూమి ఉంది. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు ఈ కాలువ ద్వారా చెరువులోకి చేరి నీటిపారుదలకు కీలకంగా మారుతుంది. ఈ చెరువు నీరే గ్రామంలోని పంటలకు, పశువులకు, ముఖ్యంగా బర్రెలు, ఆవులు, గొర్రెలకు ప్రధాన ఆధారమని వారు తెలిపారు.అయితే ప్రస్తుతం కాలువను పూర్తిగా మట్టి పోసి మూసివేయడంతో చెరువుకు రావాల్సిన నీటి ప్రవాహం నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాలువ నీటిని నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు ఇప్పుడు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమస్యపై గ్రామస్తులు ఇప్పటికే ఆర్డీవోకు (=ఖా) ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ, రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు.ఇక కాలువ పరంబోకు భూమిపై కొంతమంది వ్యక్తులు అక్రమంగా మట్టి తోలుకొని భారీ షెడ్లు నిర్మించి తాత్కాలిక వ్యాపారాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో కాలువ మార్గం పూర్తిగా పూడ్చివేయబడటంతో చెరువుకు రావాల్సిన వర్షపు నీరు చేరక చెరువు కూడా క్రమంగా ఎండిపోతున్న పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి కాలువను పునర్నిర్మించాలని గ్రామస్తులు,దిలీప్ ముని కృష్ణయ్య జితేంద్ర పురుషోత్తం కుమార్ రాజేష్ బాలాజీ వెంకటాద్రి వెంకటేశ్వర్లు తదితరులు కోరుచున్నారు.


## కదిరిలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళల అరెస్ట్

కదిరి (ఇది నిజం ప్రతినిధి):కదిరి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ. 5,65,000 విలువ చేసే నగలు, రూ. 75,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా కుంభాభిషేక ద్వితీయ దినోత్సవ క్రతువులు - యాగశాలలో వెల్లివిరిసిన మంత్రోచ్ఛారణలు.

ఇది నిజం ప్రతినిధి: విజయవాడ,ఇంద్రకీలాద్రి, 07 మార్చి 2026 :విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో అత్యంత వైభవంగా జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. శనివార ం సాయంత్రం యాగ శాలలో నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.?యా గశాల కార్యక్రమాల ఆధ్యాత్మిక విశిష్టత:?మూల మంత్రహవనములు: సాయంత్రం 4 గంటల నుండి వేద పండితులు, అర్చక స్వాముల ఆధ్వర్యంలో ‘మూల మంత్రహవనములు’ అత్యంత నిష్ఠతో ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం, అమ్మవారి దివ్యశక్తిని పునఃప్రతిష్ఠాపన చేసే క్రతువులో





భాగంగా నిర్వహించిన ఈ హోమగుండాల నుండి వెలువడిన మంత్రోచ్ఛారణలు కొండంత ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి.?ప్రదోషకాల పీఠపూజలు: అత్యంత పవిత్రమైన ప్రదోష కాలంలో పీఠపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మకు మూల మంత్ర పూర్వక అష్టోత్తర శతనామావళితో అర్చనలు చేస్తూ, పీఠం వద్ద ప్రత్యేక పూజలు సమర్పించారు.?హారతి & మంత్రపుష్పం: సాయంత్రం వేళ యాగశాల పరిసరాలు కర్పూర నీరాజనాలతో కాంతిమయమయ్యాయి. వేద మంత్రాల సాక్షిగా స్వామి, వార్లకు ‘మంత్రపుష్పం’ సమర్పించి, భక్తులందరికీ క్షేమం కలగాలని ప్రార్థించారు. ఈ వేడుకను దర్శించుకున్న భక్తులు మంత్రపుష్ప వైభవాన్ని చూసి తన్మయత్వం చెందారు.?రెండవ రోజు క్రతువులన్నీ నిర్విఘ్నంగా పూర్తి కావడంతో ఇంద్రకీలాద్రిపై భక్తి భావం వెల్లివిరిసింది. ఈ మహోత్సవంలో దేవస్థాన అధికారులు, వేద పండితులు మరియు వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లా మహిళలు అందరికీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేశారు




ఇది నిజం ప్రతినిధి: ఏలూరు, మార్చి 07: జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళలందరికీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుంచి దేశ, రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలు సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక, సామాజికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టరు ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అన్ని రంగాలలో మహిళలు పురోగతి సాధించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహిళలు తమ హక్కులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం మరింత పెరగాలని ఆమె ఆకాంక్షించారు



## రేండవ రోజు మహా కుంభాభిషేకములో జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఇది నిజం ప్రతినిధి: విజయవాడ:ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీష ఐఏఎస్ ఆదేశాల



మేరకు జిల్లా లోని ఎస్ ఆర్ఆర్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వివి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, నలంద డిగ్రీ కళాశాల మరియు ఆదిత్య డిగ్రీ కళాశాల కు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థు లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఆలయం నందు ప్రతిష్టాత్మ జరుగుతున్న మహా కుంభాభిషేకంలో భక్తులకు సేవలు అందించడానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛంద సేవకు విరివిగా పాల్గొన్నట్లు ఎన్టీఆర్ జిల్లా సీఈవో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు ఎన్ఎస్ఎస్ డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. దేవస్థానం అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ, భక్తుల నుంచి సేకరణ, క్యూ లైన్ లో నియంత్రణ, త్రాగునీరు పంపిణీ, మజ్జిగ బిస్కెట్స్ పంపిణీ, మెడికల్ క్యాంప్ సేవలు, వికలాంగులకు సేవలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ను ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ శీను నాయక్ గారు ఏఈఓ శ్రీ గంగాధర్, జిల్లా సీఈవో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ కొల్లేటి రమేష్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ను అభినందించారు. భక్తులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## గురుకుల విద్యార్థులకు చేయూతగా కాకాని ఆశయ సాధన సమితి

ఇది నిజం ప్రతినిధి:విజయవాడ:గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 (పబ్లిక్--ప్రైవేట్--



పీపుల్ పార్ట్నర్షిప్) కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలం, కుంటముక్కల డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కాకాని ఆశయ సాధన సమితి సిద్ధం చేసిన పరుపులను కలెక్టర్ లక్ష్మీశ చేతులమీదుగా శనివారం విద్యార్థులకు అందజేశారు. సేవా భావంతో కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు డా. కాకాని తరుణ్ ముందుకు వచ్చి హాస్టల్ విద్యార్థులకు అవసరమైన పరుపులను అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఇలాంటి సంస్థలు భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. జిల్లాలో పీ4 కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని, మార్గదర్శులు.. బంగారు కుటుంబాలను అన్ని విధాలా ఎదిగేలా చేసేందుకు చేయూతనిస్తున్నారని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు డా. కాకాని తరుణ్ మాట్లాడుతూ గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీగారు బాలికా విద్యపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల సాధనలో ప్రతిఒక్కరం సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.



# ప్రకృతి సాగుతో ఆదాయం, ఆరోగ్యం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత






ఇది నిజం ప్రతినిధి:విజయవాడ : ప్రకృతి వ్యవసాయంతో ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వ్యవసాయం భారం కాకుండా లాభసాటి కావాలంటే ప్రకృతి సాగే సరైన విధానమని స్పష్టం చేశారు. విజయవాడలోని ఓ హోటల్లో శనివారం ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల కోసం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై వర్క్ షాప్ లో పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి సాగుపై వర్క షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల అభ్యున్నతికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే... మరో వైపు స్వయం సమృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యధిక మంది జీవనాధారం వ్యవసాయమన్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతుండడంతో, వ్యవసాయ పెట్టుబడి భారంగా మారిందన్నారు. వ్యవసాయం లో ఖర్చును తగ్గిస్తూ, లాభాలు పెంచడానికి ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుందన్నారు. రసాయనాలపై ఆధారపడకుండా సహజ వనరులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చొచ్చునన్నారు. అటు ఆరోగ్యం, ఇటు ఆదాయం ప్రకృతి వ్యవసాయం వల్లే సాధ్యమవుతుందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఆర్గానిక్ వ్యవసాయం ఆవశ్యకత గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తోందన్నారు. జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ వనరుల వినియోగంతో నేల సారం పెరుగుతుందన్నారు. కరోనా నుంచి ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని అన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండొచ్చునన్నా రు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు అధిక ధరతో పాటు డిమాండ్ కూడా ఎక్కువేనన్నారు. ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల్లో ఉన్న రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించి, అధిక లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా స్థాయిలోనూ ఇటువంటి వర్క్ షాపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్చువల్ గా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ రైతు సాధికార సమితి వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య 60 లక్షలకు చేర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంపై ఆర్థిక వెనుకబడిన వర్గీయులను మొగ్గుచూపేలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు సేంద్రీయ ఎరువులతో సాగుచేసిన కూరగాయలు, అపరాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సవిత పరిశీలించారు. ఏయే సహజ వనరులు వినియోగించి ప్రకృతి సాగు చేశారో అడిగి తెలుసుకుని, రైతులను అభినందించారు. అనంతరం వర్క్ షాప్ ను మంత్రి సవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డూండీ రాకేశ్, ఈడబ్ల్యూఎస్ అధికారులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన రైతులు పాల్గొన్నారు.




# రెవెన్యూ సేవల్లో ప్రజల సంతృప్తే గీటురాయి

- పరిష్కార నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- సహజ వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- జల వనరులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి
- రెవెన్యూ అధికారుల సదస్సులో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఇది నిజం ప్రతినిధి: విజయవాడ:ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ల ద్వారా అందే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని.. ప్రజల సంతృప్తి స్థాయే అధికారుల పనితీరుకు గీటురాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అన్ని మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు తదితరుల సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మండలాల వారీగా రెవెన్యూ సేవల పంపిణీ, సమస్యల పరిష్కారంలో పురోగతి తదితరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న ముఖ్యమైన శాఖ అని.. ప్రజలు ప్రభుత్వంపై నమ్మకం ఉంచి తమ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తారని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ల ద్వారా అందే ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. అసైన్మెంట్స్, 22(ఏ) నుంచి తొలగింపు, రీసర్వే గ్రీవెన్సులు వంటివాటిపై వచ్చే దరఖాస్తులను క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కేవలం సమస్యను ముగించడం కోసం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని, సర్వేలు సమయానికి పూర్తిచేసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు. ఆర్డీవోల స్థాయిలో డిజిటల్ అసిస్టెంట్ల సేవలపై నిరంతర పర్యవేక్షణ ముఖ్యమని పేర్కొన్నారు. సేవలు అందించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సహజ వనరుల పరిరక్షణపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ స్పష్టంచేశారు. చెరువులు, కాలువలు, వాగులు, కుంటలు వంటి జల వనరులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ఆదేశించారు. జల వనరులు ప్రజలకు అత్యంత విలువైన సంపద అని, భవిష్యత్ తరాలకు వాటిని పరిరక్షించడం మన బాధ్యత అని, భూగర్భ జలాల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ కి రక్తదానం.



ఇది నిజం ప్రతినిధి:వజ్రపుకొత్తూరు మండలం పాత టెక్కలి గ్రామానికి చెందిన కె పావని అనే గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుంది. తన బ్లడ్ గ్రూప్ బి నెగిటివ్ కావడంచే రక్త దాతలు కొరకు వారం రోజులుగా వెతుకుతున్నారని తెలుసుకున్న పలాస వాసి అయినటువంటి ఎ అశోక్ వెంటనే స్పందించి ఆ గర్భిణీకి అవసరమైన బి నెగిటివ్ బ్లడ్ పలాస ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ లో డొనేట్ చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన కోరారు

## అన్నమయ్య జిల్లాలో 'ఆపరేషన్ వజ్రప్రహార్' డ్రోన్ల నిఘాలో తనిఖీలు.

అన్నమయ్య జిల్లా ఇది నిజం ప్రతినిధి:అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్



ఆదేశాల మేరకు రాయచోటి, మదనపల్లె (అంగళ్ళు) ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున పోలీసులు భారీ 'కార్డన్ ఉ సెర్చ్' నిర్వహించారు. మత్తు పదార్థాల రహిత జిల్లానే ధ్యేయంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' పేరుతో 10 ప్రత్యేక బృందాలు మెరుపు దాడులు చేశాయి. అధునాతన డ్రోన్ కెమెరాల సహాయంతో సమస్యాత్మక ప్రాంతాలు, ఖాళీ భవనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాయచోటిలో డీఎస్పీ కృష్ణమోహన్, మదనపల్లె రూరల్‌లో సీఐ రవి నాయక్ నేతృత్వంలో సోదాలు జరిగాయి. సరైన పత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేశారు. గంజాయి, డ్రగ్స్, కూల్-లిప్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ప్రజలతో 'నాశముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించి, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సహాయం కోసం 112, మత్తు పదార్థాల సమాచారం కోసం 1972 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఏపీలో అంగన్‌వాడీల్లో కొత్త మెనూ.

ఇది నిజం ప్రతినిధి::ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పోషకాహారంలో మార్పులు చేసింది. ఇకపై వారంలో 2 రోజులు ఎగ్ ఫ్రైడ్ రైస్ అందించనున్నారు.
అదే రోజుల్లో ఉడికించిన శనగలు కూడా ఇస్తారు. పులిహోర బదులు ఈ కొత్త మెనూను ప్రవేశపెట్టారు. బాలామృతంలో కూడా మార్పులు.
జూనియర్ బాలామృతం -- 7 నెలలు నుంచి 12 నెలల పిల్లలకు




సీనియర్ బాలామృతం -- 13 నెలలు నుంచి 36 నెలల పిల్లలకు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సంయుక్త.

సూళ్లూరుపేట,ఇది నిజం ప్రతినిధి:భారతదేశంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని సూళ్లూరుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సంయుక్త తెలియజేశారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ముందస్తు మహిళా దినోత్సవ కార్యక్రమంలో జడ్జి సంయుక్త మాట్లాడుతూ భారతదేశంలోని మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి మహిళ కష్టాలను, బాధలను, అవమానాలను ఎదుర్కొని జీవితంలో ఎన్నో ఒడిదుడుకలను అధిగమించి ఉన్నత శిఖరాలను అవరోదించాలని తెలిపారు. పై కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపల్ విక్టోరియా రాణి, ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ ఉషారాణి, సునీత, అమ్మాజీ, డాక్టర్ సల్మా, ప్రొఫెసర్స్, విద్యార్థులు, పాల్గొన్నారు.

## దుర్గమ్మకుంభాభిషేకంలో పాల్గొన్న.శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి.హోం మంత్రి అచ్చం నాయుడు... ఎంపీ కేశినేని

ఇది నిజం ప్రతినిధి:ఎన్టీఆర్ జిల్లా విజయవా డపశ్చిమ.విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో 12ఏళ్లకోసారి వైభవంగా నిర్వహించే మహా కుంభాభిషేక మహోత్సవాలు (మార్చి 6-8, 2026) అత్యంత భక్తిశ్రద్ధలతోజరుగుతున్నాయి. ఈ పవిత్ర క్రతువులో భాగంగా కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు. మరియు.= హోమ్ మినిస్టర్ అనిత... మంత్రి కే అచ్చం నాయుడు... విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని.. ఇంకా తదితరులు..శనివారం ఉదయం ఇంద్రకీలాద్రిని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారి మరియు స్వామి వార్ల దర్శనం మరియు ప్రత్యేక పూజలుఅమ్మవారి దర్శనం: ఉదయం వేళ ఇంద్రకీలాద్రికి చేరుకున్న కంచి పీఠాధిపతులకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారు అమ్మవారి మూలవిరాట్‌నుదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శివాలయం సందర్శన: అమ్మవారి దర్శనం అనంతరం స్వామి వారు క్షేత్ర పాలకుడైన మల్లేశ్వర స్వామి వారి (శివాలయం)మూలవిరాట్‌ను దర్శించి, అక్కడ కూడా ప్రత్యేక అర్చనలు చేశారు.మహా కుంభాభిషేక క్రతువు: యాగశాలలో జరుగుతున్న హోమాలు మరియు ఇతర వైదిక కార్యక్రమాలను స్వామి వారు పర్యవేక్షించి, అర్చకులకు మరియు భక్తులకు తమఆశీస్సులను అందజేశారు..స్వామి వారి పర్యటనలో మరియు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈ క్రింది ప్రముఖులు పాల్గొన్నారు:శ్రీ రామచంద్ర మోహన్: దేవాదాయ శాఖ కమిషనర్. వి.కె. సీనా నాయక్: ఆలయ కార్యనిర్వహణాధికారి . బొర్రా రాధాకృష్ణ. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్.వీరితో పాటు పాలకమండలి సభ్యులు మరియు ఇతర ఉ









న్నతాధికారులు స్వామి వారి ప్రతి కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించారు. ప్రముఖ సమాచారంమహా కుంభాభిషేకం: ఆగమ శాస్త్రం ప్రకారం ప్రతి 12 ఏళ్లకోసారి ఆలయ పునరుజ్జీవనం కోసం ఈ పవిత్ర క్రతువు నిర్వహిస్తారు.భక్తుల రద్దీ: ఈ మూడు రోజుల ఉత్సవాల్లో సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసి, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## దుర్గమ్మ దేవస్థానం పై ఆధ్యాత్మిక వైభవం కంచి జగద్గురువుల చేతుల మీదుగా "శ్రీమద్భగవద్గీత" పుస్తకావిష్కరణ



ఇది నిజం ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ.ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో కుంభాభిషేకమహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ పుణ్య ఘడియల్లో క్షేత్రానికి విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు నేడు ఉదయం ఒక విశేష కార్యక్రమంలోపాల్గొన్నారు.శ్రీమద్భగవద్గీత పుస్తకావిష్కరణ?లోక కల్యాణార్థం మరియు యువతలో ఆధ్యాత్మిక చైతన్యం నింపే ఉద్దేశంతో రూపొందించిన"శ్రీమద్భగవద్గీత" (వివిధ సంపుటాల) పుస్తకాలనుజగద్గురువులు ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూఆదిశంకరులు నడిచిన ధర్మ మార్గం లో యువత ప్రయాణం చేయాలని,భగవద్గీత కేవలం ఒక మత గ్రంథం కాదని, అది మానవాళికి జీవన మార్గదర్శిని అని పేర్కొన్నారు.?ఆధునిక కాలంలో యువతకు అర్థమయ్యే రీతిలో ఇటువంటి ఆధ్యాత్మిక గ్రంథాలనుఅందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని,సనాతన ధర్మం అందించిన అమూల్యమైన జ్ఞానాన్ని నేటి తరం యువతకు చేరువ చేయడం అభినందనీయమని కొనియాడారు.?భగవద్గీత బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ వెలుగును నింపుతాయనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణకార్యనిర్వాహణాధికారి వికె శీనానాయక్ పాల్గొన్నారు.

## చక్రస్నాన ఉభయం.. స్వామివారి అనుగ్రహం

**- వైభవోపేతంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి చక్నస్నానం**
**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు**
**- ఆధ్యాత్మిక శోభతో పులకించిన కొండ బిట్రగుంట**

నెల్లూరు జిల్లా కొండబిట్రగుంట ఇది నిజం ప్రతినిధి::కలియుగ దైవం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి చక్రస్నాన ఉభయం స్వామివారి అనుగ్రహంతోనే సాధ్యమైందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు అన్నారు.



కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు శనివారం స్వామివారికి అంగరంగ వైభవంగా స్నపన తిరుమంజనం, చక్రస్నానం జరిగాయి. ముందుగా స్వామి వారి కోనేరు వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వేమిరెడ్డి దంపతులు అర్చకులతో కలిసి చక్రతాళ్వారుకు కోనేరులో చక్ర స్నానం చేశారు. గోవింద నామ స్మరణల మధ్య కోనేరు ప్రాంగనం మార్మోగిపోయింది. అనంతరం కొండపై స్వామివార్లను వేమిరెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశిర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి వార్లకు చక్ర స్నానం మా చేతులమీదుగా నిర్వహించడం అదృష్టమన్నారు. ఇక ప్రతి బ్రహ్మోత్సవాల్లో చక్ర స్నానం ఉభయం తాము నిర్వహిస్తామన్నారు. చోళుల కాలం నాటి కోనేరును బాగు చేసి నిర్మించడం గొప్ప వరమని చెప్పారు. ఇది మాకు స్వామి వారి అనుగ్రహమని చెప్పారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషముగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఈవో అరవ రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

## ఉగాది పురస్కారానికి పత్తిపాటి రమేష్ నాయుడు ఎంపిక

పాకాల, మార్చి 7 (ఇది నిజం ప్రతినిధి:):శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాలకు పాకాల మండలం దామలచెరువు ప్రాథమిక



పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ పద్యకవి, అభినవ వేమన, శతకరత్న బిరుదాంకితులు పత్తిపాటి రమేష్ నాయుడు ని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ -- శ్రీమతి ప్రభావతి గార్ల పేరుతో ప్రతి ఏడాది నిర్వహించే ఉగాది పురస్కారాలకు ఈ సంవత్సరం ఆయనను ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు కె. బాబ్జి, ఎన్. లింగయ్య హర్షం వ్యక్తం చేశారు. మార్చి 15వ తేదీన కృష్ణా జిల్లా ఉయ్యూరులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పత్తిపాటి రమేష్ నాయుడు కి ఈ ఉగాది పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పత్తిపాటి రమేష్ నాయుడు ఇప్పటివరకు 11 పుస్తకాలను ముద్రించి ఉచితంగా సుమారు 17 వేల కాపీలను పంపిణీ చేశారు. అలాగే ఆటవెలది పద్యాలు 2000కు పైగా రచించి సాహిత్యరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు ఉగాది పురస్కారం ప్రకటించడంపై పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

## అంగన్వాడి భవనం ప్రారంభం



శ్రీకాళహస్తి, ఇది నిజం ప్రతినిధి:, :ఏర్పేడు మండలం కాట్రకాయలగుంట గ్రా మంలో ఆధునీ కరించిన అంగన్వాడి భవనం శనివారం ప్రారంభమైంది. శ్రీకా ళహస్తికి సమీపంలోని కోకా కోలా కర్మాగారం నిధులతో అంగన్వాడి భవనాన్ని ఆధుని కరించా రు. శనివారం టిడిపి నాయకురాలు రిషిత ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పొన్నారావు, నాగరాజా నాయుడు, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు..



# ఏల్చూరులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరునాళ్లకు సర్వం సిద్ధం

సంతమాగులూరు, మార్చి 7, ఇది నిజం ప్రతినిధి: సంతమాగులూరు మండలం, ఏల్చూరు గ్రామంలో ఓరుగంటి కుటుంబాలు ఇలవేల్పుగా



భావించే పవిత్ర క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వార్షిక తిరునాళు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, ఆధ్యాత్మిక వైభవం, భక్తుల విశ్వాసాలకు నిలయంగా నిలిచిన ఈ క్షేత్రం ప్రత్యేకతలను పాఠకులకు పరిచయం చేయాల్సిన అవసరం ఏర్పడింది. తరతరాలుగా కొనసాగుతున్న భక్తి సంప్రదాయం ఏల్చూరు గ్రామంలోని ఓరుగంటి వంశీకులు ఈ ఆలయాన్ని తమ ఇలవేల్పుగా భావిస్తూ తరతరాలుగా స్వామివారిని సేవిస్తున్నారు. కుటుంబాల్లో జరిగే ప్రతి శుభకార్యానికి ముందు స్వామివారి దర్శనం తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. పుట్టిన పిల్లలకు నామకరణం నుంచి వివాహాలు వరకు అన్ని శుభ కార్యక్రమాల్లో స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం కుటుంబ సంప్రదాయంగా నిలిచింది. కష్టాలను తొలగించే కరుణామయుడు స్థానికుల నమ్మకం ప్రకారం స్వామివారిని భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తే జీవనంలో ఎదురయ్యే కష్టాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. అనారోగ్యాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలతో వచ్చిన భక్తులు స్వామివారి కృపతో ఉపశమనం పొందారని అనుభవాలు చెబుతుంటారు. అందుకే సమీప గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. పురాతన మండపం ప్రత్యేక ఆకర్షణ ఆలయం సమీపంలో ఉన్న పురాతన శిలా మండపం ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ మండపం అప్పటి శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయ చరిత్రకు ఇది సాక్ష్యంగా నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. తిరునాళ్లతో ఆధ్యాత్మిక సందడి ప్రతి సంవత్సరం జరిగే వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏల్చూరు గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతుంది. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు కూడా చేపడతారు. ఈ వేడుకలకు గ్రామస్థులు, ఓరుగంటి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావంతో సేవలు అందిస్తారు. శతాబ్దాల చరిత్రను మోస్తూ భక్తుల విశ్వాసాలకు నిలయంగా నిలిచిన ఏల్చూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నేటికీ భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఆదివారం జరిగే తిరునాళ్లతో ఈ పవిత్ర క్షేత్రం మరింత భక్తి ఉత్సాహంతో కళకళలాడనుంది.

# నేటి తరం హైటెక్... రాబోయే తరం ఏఐ.. క్వాంటం

## భవిష్యత్తును ముందే చదివిన దూరదృష్టి నాయకత్వం చంద్రబాబు

## నాడు ఐటీ విప్లవానికి శ్రీకారం... నేడు క్వాంటం వ్యాలీతో భవిష్యత్తు సాంకేతిక యుగానికి దిశానిర్దేశం.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు




ఇది నిజం ప్రతినిధి:అమరావతి మార్చి 07: నేటి తరం హైటెక్ ప్రపంచంలో ఎదుగుతుండగా, రాబోయే తరం పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ ఆధారిత ప్రపంచంలో జీవించబోతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆ భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్న దూరదృష్టి నాయకుడు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారేనని పేర్కొన్నారు.ప్రపంచ చరిత్ర పుటలను తిరగేస్తే ఒక నగ్న సత్యం స్పష్టమవుతుందని పల్లా అన్నారు. కాలంతో పాటు అప్‌డేట్ కానివారు చరిత్రలో కలిసిపోతారని, మార్పును ముందుగానే పసిగట్టినవారే ప్రపంచాన్ని శాసిస్తారని పేర్కొన్నారు. మానవ పరిణామ క్రమంలో వ్యవసాయ విప్లవం నుంచి పారిశ్రామిక విప్లవం వరకు, అక్కడి నుంచి సమాచార సాంకేతిక యుగం వరకు ప్రతి కీలక దశలోనూ మార్పును ముందే గుర్తించి అందిపుచ్చుకున్న దేశాలే ప్రపంచ యవనికపై ఆధిపత్యాన్ని సాధించాయని తెలిపారు. క్వాంటం విప్లవం దిశగా ప్రపంచం ఇప్పుడిప్పుడే ప్రపంచం మరో చారిత్రక మలుపు వద్ద నిలిచిందని, ఆ సరికొత్త విప్లవం పేరు క్వాంటం కంప్యూటింగ్ అని పల్లా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సాంకేతికతలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, చైనాలోని హైనన్ ప్రావిన్స్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో, అమరావతిని కేంద్రంగా చేసుకొని క్వాంటం వ్యాలీ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం కేవలం ఒక అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదని, రాబోయే శతాబ్దపు సాంకేతిక పోటీలో భారత్‌ను అగ్రగామిగా నిలిపే సాహసోపేతమైన ముందడుగని అభివర్ణించారు. నాడు హైటెక్ సిటీ... నేడు క్వాంటం వ్యాలీ నాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణంతో ఐటీ విప్లవానికి పునాది వేసిన విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు గారేనని పల్లా గుర్తుచేశారు. నేడు అదే దూరదృష్టితో క్వాంటం వ్యాలీ ద్వారా భవిష్యత్తు ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. క్వాంటం వ్యాలీ రాష్ట్ర ఆధునిక సాంకేతిక ప్రగతికి ఒక డిజిటల్ సంతకం అని పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం -- గ్లోబల్ దిశలో అడుగు అమరావతికి క్వాంటం వ్యాలీ రావడం వెనుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశాబ్దాల అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిబద్ధత, మంత్రి నారా లోకేష్ ఆధునిక వ్యూహం కలిసి పనిచేశాయని పల్లా తెలిపారు. 2025 జనవరిలో దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఐబీఎం, గూగుల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలతో మంత్రి నారా లోకేష్ జరిపిన ముందస్తు చర్చలే ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేశాయని చెప్పారు.అమరావతిని కేవలం ఐటీ హబ్‌గా కాకుండా భవిష్యత్తు సాంకేతిక కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేయడంలో లోకేష్ పాత్ర కీలకమని, చంద్రబాబు తన రాజకీయ చాతుర్యం, అనుభవంతో దీనికి జాతీయ స్థాయి ప్రాధాన్యతను తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎంవో నిరంతర పర్యవేక్షణలో వివిధ శాఖలను సమన్వయం చేస్తూ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం జరిగిందని, ఐబీఎం వంటి సంస్థలతో ఒప్పందాలను ఖరారు చేయడంలో సీఎంవో కీలక పాత్ర పోషించిందన్నారు. అమరావతి చరిత్రలో కొత్త అధ్యాయం దాని ఫలితంగానే ఫిబ్రవరి 7న అమరావతి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని పల్లా పేర్కొన్నారు. తుళ్లూరు మండలం ఉద్ధండరాయునిపాలెంలో అమరావతి క్వాంటం వ్యాలీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కలిసి శంకుస్థాపన చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ క్వాంటం పటంలో నిలిపే చరిత్రాత్మక ముందడుగు పడిందన్నారు.ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి అంతర్జాతీయ దిగ్గజాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రం భారతదేశంలోనే మొట్టమొదటి 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్కు వేదిక కానుందని తెలిపారు. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి డిసెంబర్‌లో కార్యరూపంలోకి తీసుకురావాలన్న లక్ష్యం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. యువతకు అంతర్జాతీయ అవకాశాలు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి హైఎండ్ ఉపాధి అవకాశాలను తెరుస్తుందని పల్లా అన్నారు. సంప్రదాయ ఉద్యోగాల పరిధిని దాటి సరికొత్త అవకాశాలు సృష్టించడంతో మేధో వలసలు తగ్గి ప్రతిభ అంతా రాష్ట్రానికే సొంతమయ్యే బ్రెయిన్ గెయిన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 54 వేల మంది విద్యార్థులు క్వాంటం శిక్షణలో పాల్గొనడం ఈ రంగంపై యువత ఆసక్తికి నిదర్శనమన్నారు. ప్రపంచ కంపెనీల విశ్వాసం క్వాంటం కంప్యూటింగ్ దిశగా రాష్ట్రం అడుగులు వేయడం ప్రారంభమైన కొద్దికాలంలోనే గన్నవరంలోని మేధా టవర్స్ అంతర్జాతీయ టెక్ సంస్థలకు కేంద్రంగా మారిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతపై ఉన్న విశ్వాసంతో క్యూక్లారిఎ ోయెన్స్, క్యూబీట్స్, సైబ్రానెక్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూబిటెక్, క్వాన్ ఫ్యూయెన్స్ వంటి దాదాపు 30 అగ్రశ్రేణి సంస్థలు తమ కా ర్య క లా పా ల ను ప్రారంభించాయని చెప్పారు. చంద్రబాబు ఒక కొత్త సాంకేతిక దిశలో అడుగు వేస్తే ప్రపంచం మొత్తం అటువైపే నడుస్తుందనే నమ్మకానికి ఈ సంస్థల రాకే నిదర్శనమన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విప్లవం క్వాంటం కంప్యూటింగ్ గణన ప్రక్రియలోనే ఒక అసాధారణ విప్లవమని పల్లా వివరించారు. సాధారణ కంప్యూటర్లు బిట్స్ ఆధారంగా పనిచేస్తే, క్వాంటం కంప్యూటర్లు క్విబిట్స్ ద్వారా ఒకే సమయంలో 0 మరియు 1 రెండింటినీ ఉపయోగించి అద్భుత వేగాన్ని ప్రదర్శిస్తాయని తెలిపారు. సాధారణ కంప్యూటర్లకు శతాబ్దాల సమయం పట్టే సంక్లిష్ట సమస్యలను క్వాంటం కంప్యూటర్లు కేవలం నిమిషాల్లోనే పరిష్కరించగలవని చెప్పారు. కొత్త మందుల తయారీ నుంచి ఇంటర్నెట్ భద్రత వరకు అనేక రంగాల్లో ఈ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ గుర్తింపుఅందుకే అమరావతిలో నిర్మించే క్వాంటం వ్యాలీ రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చనుందని పల్లా అన్నారు. నాడు ఐటీతో రాష్ట్ర తలరాత మారినట్లే, రేపు ఈ క్వాంటం వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికే ఒక దిక్సూచిగా నిలబెట్టబోతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ ఇది కేవలం టెక్నాలజీ మార్పు మాత్రమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని తెలిపారు. అధిక విలువ కలిగిన పరిశ్రమలు, పరిశోధన ఆధారిత పెట్టుబడులు రావడం వల్ల ఆదాయ వనరులు పెరిగి విజ్ఞానమే సంపదగా మారే ఆర్థిక వ్యవస్థకు పునాది పడుతుందని అన్నారు. ఐటీ నుంచి క్వాంటం వరకు -- అదే దూరదృష్టి 1998లో హైదరాబాద్ హైటెక్ సిటీకి శ్రీకారం చుట్టినప్పుడు వ్యక్తమైన సందేహాలను పటాపంచలు చేస్తూ ఆ నిర్ణయం ఒక తరాన్ని ఐటీ యుగంలోకి నడిపించిందని పల్లా గుర్తుచేశారు.

సరిగ్గా అదే దూరదృష్టి నేడు అమరావతి క్వాంటం వ్యాలీ రూపంలో కనిపిస్తోందన్నారు. అప్పట్లో ఐటీ విప్లవానికి తలుపులు తెరిచిన నాయకుడు చంద్రబాబు... ఇప్పుడు అంతకంటే వేగవంతమైన ఏఐ..క్వాంటం యుగానికి రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్న నాయకుడు కూడా ఆయనేనని కొనియాడారు.

భవిష్యత్తుకు రాష్ట్రం సిద్ధం సాంకేతిక మార్పును గుర్తించి అప్‌డేట్ కాకపోతే సమాజం వెనుకబడిపోతుందని చరిత్ర ఎన్నోసార్లు హెచ్చరించిందని పల్లా అన్నారు. కాలం ఎవరి కోసం ఆగదని, కాలంతో పాటు పరిగెత్తాలా లేక కాలం మనల్ని పక్కన పెట్టాలా అనే ప్రశ్నకు రాష్ట్రం సగర్వంగా ఇస్తున్న సమాధానమే అమరావతి క్వాంటం వ్యాలీ అని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



సంతమాగులూరు, మార్చి 7,ఇది నిజం ప్రతినిధి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ) కొమ్మాలపాడు పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా "మహిళలకు సహకారాన్ని అందిద్దాం.. సమాజ అభివృద్ధిని సాధిద్దాం" అనే నినాదంతో కార్యక్రమం జరిగింది. పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. విద్యా రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంపీపీఎస్ కొమ్మాలపాడు (హెచ్‌ఈ) ప్రధానోపాధ్యాయులు పి.సిహెచ్. పుల్లారావు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని మహిళా ఉపాధ్యాయులను అభినందించారు. మహిళలకు గౌరవం, సహకారం అందించినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

# మహిళల సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యం

ఇది నిజం ప్రతినిధి: విజయవాడ:ఏపిజేఏసి అమరావతి రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం స్టేట్ చైర్ పర్సన్ శ్రీమతి పారే లక్ష్మి మరియు సెక్రటరీ జెనరల్ శ్రీమతి పొన్నూరు విజయలక్ష్మి సారథ్యంలో అంగరంగ వైభవంగా జరిగింది.మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ పారె లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిడ శిశు సంక్షేమశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీమతి ఏ.సూర్యకుమారి..ఐఎఎస్ గారు, ఎన్టీఆర్ జిల్లా జాయింటు కలెక్టర్ శ్రీమతి ఇలలక్కియ ఐఎఎస్ గారు ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు గారు, విశిష్ఠ అతిధులుగా పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె విజయకుమారి గారు,జాయింట్ డైరెక్టర్ ఎకనామిక్స్ అండ్ స్టాటస్టిక్స్ శ్రీమతి బి అనుపమ గారు హాజరై కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సెక్రటరీ జనరల్ శ్రీమతి విజయలక్ష్మి గారు అతిధులను,మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులను సాదరంగా ఆహ్వానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మూలలను వివరిస్తూ సభను ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీమతి సూర్యకుమారి ×ూూ గారు మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, కుటుంబ పురోగతి మరియు దేశ ప్రగతిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుమారులు కలిగిన ప్రతి మహిళా కుమారులకు కూడా వంట నేర్పించాలని తద్వారా ఉద్యోగాల్లో భార్యాభర్తలు ఉద్యోగాలు చేసుకొనే వారు అన్నింటా బాధ్యతలు పంచుకోవడానికి పనిచేస్తుందని, ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తూ ముందుకు సాగుతున్నారని, ప్రభుత్వ సేవల్లో కూడా మహిళల భాగస్వామ్యం నేడు పెరగడం చాలా శుభ, ్ ప రి ణా మ ం మ ం ని అన్నారు.ఈసమావేశంలో పాల్గొన్న మరోక ముఖ్యఅతిథి యన్టీఆర్ జిల్లా జాయింటు కలెక్టర్ డ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి ఇలక్కియ..ఐఏయన్ గారు మాట్లాడుతూ మహిళల హక్కులు, సంక్షేమం మరియు సాధికారత కోసం అన్ని స్థాయిల్లో కృషి కొనసాగించాలని పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మహిళా దోత్సవం మహిళల సాధికారతకు ప్రేరణ నిచ్చే రోజు అని ఆమే పేర్కొంటూ, మహిళలు ఐక్యంగా ముందుకు వచ్చి సమాజ నిర్మాణంలో మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి విశిష్టఅతిథి ఏపిజేఏసి అమరావతి చైర్మన్ శ్రీ.బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "మహిళలకు అవకాశాలు కల్పిస్తే కుటుంబం బలపడుతుంది, కుటుంబం బలపడితే సమాజం బలపడుతుంది." "మహిళల భద్రత, హక్కులు, నాయకత్వం కోసం మనం చేసే ప్రతి ప్రయత్నం సమానత్వంతో కూడిన శక్తివంతమైన సమాజాన్ని నిర్మిస్తుందనీ పేర్కొన్నారు . గౌః ముఖ్యమంత్రి శ్రీ.నారా చంధ్రబాబునాయుడు గారు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని,అందులో బాగంగానే




మహిళలు ఆర్ధికంగా బలోపేతం చేయడం కోసం,పేదవర్గాల మహిళలకు ప్రతిరోజు ప్రయోజనం కలిగేలా ఆర్టీసి బస్సుల్లో స్త్రీశక్తి పధకాన్ని ప్రవేశ పెట్టారు.అలాగే ఉద్యోగులలో సుమారు అన్ని రంగాలలో 50/60 శాతం ఉన్న మహిళాఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలని ఉద్యోగసంఘాలతో జరిగిన సమావేశంలో ఏపిజేఏసి అమరావతి రాష్ట్రకమిటి గౌఃసి.యం.గారికి చేసిన విజ్ఞప్తి మేరకు ధీపావళికానుకగా చైల్డుకేర్ లీవ్ కు ఉన్న ఏజ్ లిమిట్ 18 సంవత్సరాలు క్యాఫ్ ను ఎత్తివేసి ఉద్యోగిణి రిటైర్ అయ్యేలోపు ఎప్పుడైనా వాడుకొనేలా ఇచ్చేందుకు వెంటనే అంగీకరించి వెంటనే జిఓ నెంః 70 విడుదల చేయడపట్ల గౌః సి.యం గారికి కృతజ్ఞతలు ప్రభుత్వానికి మహిళలు అంటే ఎంతగా గౌరవిస్తున్నారో తెలుసుకోవచ్చని అన్నారు. అదేవిధంగా ఏపీ జెఎసి అమరావతి నాల్గవ రాష్ట్ర మహాసభకు రెండు రోజులు ప్రత్యేక సెలవులు మంజూరు చేయడమే కాకుండా నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు, ఆటలకు పాటలకు మహిళలకు ప్రత్యేకమైన అనుమతి మంజూరు చేసి గౌ.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మహిళా పక్షపాతిగా నిరూపించుకొన్నారని తెలియచేశారు విశిష్ట అతిధులుగా విచ్చేసిన పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీమతి కె విజయకుమారి గారు,జాయింట్ డైరెక్టర్ ఎకనామిక్స్ అండ్ స్టాటస్టిక్స్

